

అసెంబ్లీకి విద్యార్థిని ఎంపిక

టెక్కలి : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రాష్ట్ర అసెంబ్లీ పర్యటనలో భాగంగా శనివారం నియోజకవర్గ పోటీలు నిర్వహించామని పోటీలు నిర్వహించామని టెక్కలి బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శోభారాణి తెలిపారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థి రొక్కం రష్మికసంతోషి అసెంబ్లీ పర్యటన హాజరుకు ఎంపికయ్యారని అన్నారు. ఆమె ఎంపికపై గైడ్ టీచర్ నంబాళ్ల వాణీశ్రీ రమాదేవి, స్వాతిలి, ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావులు అభినందించారు.



రష్మికసంతోషి

కార్తీక ఏకాదశి దర్శనం కోసం తెల్లవారుజామునే బయల్దేరిన వారు సాయంత్రానికి ఇంటి ముంగిటికి చేరలేదు. వారి పయనం మృత్యు దర్శనంగా ముగిసిపోయింది. క్షణాల్లోనే భక్తి గీతాల మధ్య దు:ఖ రోదనలు మిన్నంటాయి. 13 ఏళ్ల బాలుడి ఆర్తనాదాలు, 60 ఏళ్ల వృద్ధురాలి ఆఖరి శ్వాస తొక్కిసలాటలో పాదాల కింద నలిగిపోయాయి. అనుకోని ఈ ఘటనతో భక్తి వాతావరణం కాస్త భయానక వాతావరణంలా మారిపోయింది. అప్పటి వరకూ తమతో ఉన్నవారు క్షణాల్లో మృతదేహాలుగా మారిపోవడం, ఉత్సాహంగా వచ్చిన వారు ఊపిరి తీసుకోవడమే కష్టంగా మారడంతో ఆ ప్రాంతంలో రోదనలు మిన్నంటాయి. వెరసి కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం సంభవించిన తొక్కిసలాటలో తొమ్మిది మంది యాత్రికులు మృతి చెందగా, 15 మంది గాయపడ్డారు. వారిలో ముగ్గురు పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే...

ఆలయంలో ఘోరం

- కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట
- 9 మంది యాత్రికులు మృతి
- 15 మందికి గాయాలు
- ముగ్గురు పరిస్థితి విషమం
- జిల్లాలో విషాదం



మృతదేహాలు



రూప (మందస) రాజేశ్వరి (మందస) యశోదమ్మ (నందిగాం) నిఖిల్ (సోంపేట) విజయ (టెక్కలి) నీలమ్మ (టెక్కలి) (ఫైల్)

ప్రజాశక్తి- పలాస, మందస, కవిటి

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటనలో 9 మంది మృతి చెందారు. అక్కడికక్కడే ఏడుగురు మృతి చెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో మృతి చెందారు. 17 మంది గాయపడ్డారు. వీరిలో మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కార్తీక ఏకాదశి సందర్భంగా కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయానికి జిల్లాలోని యాత్రికులు భారీగా పోటెత్తడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతి చెందిన వారిలో ఎనిమిది మంది మహిళలు, 13 ఏళ్ల బాలు ఉండడంతో జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ తొక్కిసలాటలో టెక్కలి మండలం రామేశ్వరం గ్రామానికి చెందిన ఈదురి చిన్నమ్మ (50), పిట్టలసారికి చెందిన రాపాక విజయ (48), వజ్రపుకొత్తూరు మండలం దుక్కవానిపేటకు చెందిన మురిపింటి నీలమ్మ (60), మందస మండలం బెల్లుపట్టియాకు చెందిన దువ్వు రాజేశ్వరి (60), గుడ్డుభద్రకు రూప (40), మందసకు చెందిన బృందావతి (62), నందిగాం మండలం శివరాపురానికి చెందిన చిన్ని యశోదమ్మ (56), సోంపేట మండలం బెంకిలికి చెందిన లోట్ల నిఖిల్ (13), పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన డొక్కర అమ్ముడమ్మ (50) ఉన్నారు. తొక్కిసలాటలో నందిగాం మండలం రౌతుపురానికి చెందిన బాకి కళావతి, మందస మండలం బెల్లుపట్టియాకు చెందిన దువ్వు కుమారి తీవ్రంగా గాయపడ్డారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు రిఫర్ చేశారు. మృతదేహాలను స్థానిక పలాస ప్రభుత్వాస్పత్రిలో శవపంచనామా నిర్వహించిన బంధువులకు అప్పగించారు. దర్శనానికి వెళ్లడం, రావడం ఒకే మెట్లపైనే రావడంతో కిక్కిరిసిపోయింది. మెట్ల అంచున ఉండడంతో బలహీనంగా ఉన్న రెయిలింగ్ కూలిపోయింది. ఆ సమయంలో కొందరు మహిళలు కింద పడిపోయారు. ఆ తరువాత మిగతా యాత్రికులు ఒక్కసారిగా పరుగులు తీయడంతో పడిపోయిన వారిపై నుంచి వెళ్లిపోయారు. ఆలయ నిర్మాణం కూడా పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్‌పి పోలీసు సిబ్బంది ఆదేశాలు జారీ చేశారు. పోలీసులు ఆలయానికి చేరుకుని భద్రతా చర్యలు చేపట్టారు. దర్శనానికి వెళ్లిన యాత్రికులను పంపించేశారు.

భక్తి కేంద్రం - భద్రతా లోపం

కాశీబుగ్గకు చెందిన హరి ముకుంద పండా సొంత నిధులు రూ.3 కోట్ల వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మించారు. నాలుగు నెలల క్రితం ప్రారంభమైన ఈ ఆలయం సామాజిక మాధ్యమాల్లో 'చిన్న తిరుపతి'గా ప్రాచుర్యం పొందడంతో యాత్రికుల రద్దీ పెరిగింది. దానికి తగ్గట్టు భద్రతా ఏర్పాట్లు లేకపోవడమే ఈ దుర్ఘటనకు ప్రధాన కారణంగా స్థానికులు విమర్శిస్తున్నారు. కనీస స్వచ్ఛంద వాలంటీర్లను కూడా ఏర్పాటు చేయలేదు.



మృతదేహాలను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

108 సేవలు అభినందనీయం

ప్రమాదం తర్వాత వెంటనే స్పందించిన 108 అంబులెన్స్ సిబ్బంది ప్రశంసలందుకున్నారు. ఏడు వాహనాల్లో 43 మంది క్షతగాత్రులను రక్షించి పలాస ఆస్పత్రికి తరలించారు. ప్రమాద స్థలంలోనే ప్రథమ చికిత్స అందించి మరికొంతమందిని ప్రాణాలతో బయటకు తీశారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం


కాశీబుగ్గ పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం ఉదయం జరిగిన తొక్కిసలాటలో మొత్తం తొమ్మిమంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి తక్షణమే నివేదిక సమర్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్‌కర్, ముగ్గురు అధికారులతో కూడిన విచారణ బృందాన్ని నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఎఎస్‌పి కె.వి.రమణ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ ఈ బృందంలో ఉన్నారు. వీరు ఈ దుర్ఘటనకు సంబంధించి దర్యాప్తు చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

ఘటన ఎలా జరిగింది?

ఏకాదశి కావడంతో మహిళలకు ఉచిత బస్సులు ఉండటంతో ఉదయం నుంచే వేలాది మంది ఆలయానికి తరలివచ్చారు. క్యూలైన్‌లో భక్తుల రద్దీ అధికమవుతుండగా స్టీల్ గ్రిల్ ఒక్కసారిగా ఊడిపోవడంతో తొక్కిసలాట జరిగింది. కొందరు కిందపడగా, మరికొందరు వారిపై పడడంతో ఊపిరాడక మృతి చెందారు. ఘటన స్థలంలోనే ఏడుగురు మృతి చెందగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్ సిబ్బంది చాకచక్యంగా బయటకు తరలించి పలాస ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని శ్రీకాకుళం జెమ్స్ తరలించారు.

పలాస ఆస్పత్రిలో మిన్నంటిన రోదనలు

పలాస ప్రభుత్వాస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల ఆర్తనాదాలతో ఆస్పత్రి ప్రాంగణంలో గంభీర వాతావరణం ఏర్పడింది. మరోవైపు బాధితులను పరామర్శించేందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, అధికార ప్రతిపక్ష నాయకులు ఆస్పత్రికి చేరుకోవడంతో ఆ ప్రాంతం పూర్తిగా భద్రతా అధికారుల వలయంలా మారిపోయింది.



రోదిస్తున్న క్షతగాత్రులు

ఐదు ఎకరాల్లో...

కాశీబుగ్గకు చెందిన హరి ముకుందా పండా తన సొంత ఐదు ఎకరాల కొబ్బరి తోటలో వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం చేపట్టారు. గతంలో ముకుందా పండా తిరుపతి దర్శనానికి వెళ్లారు. అక్కడ వెంకటేశ్వర స్వామిని దర్శనానికి వెళ్తే దర్శనం కాకపోవడంతో తానే సొంతంగా ఆలయాన్ని నిర్మిస్తానని చెప్పి అక్కడ నుంచి వెనుదిరిగారు. రెండేళ్ల నుంచి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు ఆరు నెలలు క్రితం మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా ఆలయాన్ని నిర్మించారు.

యాత్రికుల తాకిడి ఊహించలేదు

భక్తుల తాకిడి తాను ఊహించలేదని ఆలయధర్మకర్త ముకుంధ వండా తెలిపారు. తిరుపతి ధర్శనానికి తాము వెళితే దర్శన భాగ్యం కలగకపోవడంతో తనకు ఉన్న 15 ఎకరాలలో కోట్లాది రూపాయలు వెచ్చించి భక్తుల కోసం ఆలయాన్ని నిర్మించానని తెలిపారు. కార్తీకమాసం ఏకాదశి కావడంతో బందోబస్తు కావాలని పోలీసులను కోరినా ఆశించిన బందోబస్తు చేయలేదని అన్నారు. జనసంద్రాని ఊహించలేకపోయానని అన్నారు.



ప్రమాదానికి ముందు దర్శనానికి తరలివచ్చిన యాత్రికులు

సామర్థ్యానికి మించి...

కార్తీక మాసం ఏకాదశి కావడంతో సుమారు 15 వేలకుపైగా భక్తులు దర్శనార్థం ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే యాత్రికుల రద్దీకి తగిన సదుపాయాలు లేకపోవడం, క్యూ లైన్‌లో ఏర్పాటు చేసిన స్టీల్ రాడ్లు బలహీనంగా ఉండడంతో తోపులాట జరిగింది. దాంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తీవ్రంగా గాయపడిన 15 మందిని పలాస సిహెచ్‌సికి తరలించగా వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది.

దహన సంస్కారాలకు రూ.పది వేలు

డొక్కరి అమ్మడమ్మ కుటుంబానికి దహన సంస్కారాలు నిమిత్తం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రతి కుటుంబానికీ రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేయాలని తహశీల్దార్లకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్ ఆదేశాలు జారీ చేశారు. మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ప్రభుత్వ వైఫల్యం

ప్రభుత్వం ప్రైవేటు దేవాలయాలని తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. జరిగిన ఘటనా ప్రభుత్వ వైఫల్యం. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలి. శాశ్వత నష్టపరిహారం చెల్లించాలి. ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి. ముందుస్తు అంచనా వేయలేకపోవడమే మృతుల సంఖ్య పెరిగింది.

- మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఘటన పూర్తిగా పోలీసుల వైఫల్యం. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి జరిగిన గంటలో ప్రైవేటు ఆలయంలో జరిగిన ఘటనకు ప్రభుత్వానికి ఏమి సంబంధం అని మాట్లాడటం సరికాదు. మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.12 లక్షలు నష్టపరిహారం ప్రకటించి చేతులు దులుపుకోవడం సరికాదు. ఒక్కో మృతుల కుటుంబాలకు రూ.కోటి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

- మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

స్టీల్ రాడ్ మధ్యలో కాలు ఉండిపోయింది

ఆలయం లోపలి నుంచి యాత్రికులు వస్తున్నారు. ఇంతలో ఆలయం లోపలికి వెళ్లే యాత్రికులు విపరీతంగా పెరిగిపోవడంతో లోపులాట జరిగింది. లోపులాటలో కొంత మంది యాత్రికులు మెట్టపై నుంచి జారి పడ్డారు. ఆ సమయంలో తాను కూడా కిందికి పడ్డాను. స్టీల్ గేట్ మధ్యలో కాలు ఉండిపోయింది.

- బి.పుష్ప, చినహంస, మెళియాపుట్టి మండలం

కళ్ల ముందే భార్య మృతి

రాపాక చిన్నారావు, రాపాక విజయ కలిసి ద్విచక్ర వాహనంపై ఆలయానికి వచ్చాం. మా గ్రామం నుంచి మరి కొంత మంది బస్సులో వచ్చారు. నేను, నా భార్య ఆలయం లైన్‌లో ఉన్నాం. ఇంతలో జనాలు పెరగడం ఆలయ తలుపులు మూసి వేయడంతో ఒక్కసారిగా యాత్రికుల సంఖ్య పెరిగింది. నా కళ్లముందే నా భార్య విజయ తొక్కిసలాటలో మృతి చెందింది.

- రాపాక చిన్నారావు, పిట్టలసరియా, టెక్కలి మండలం

తృటిలో తప్పించుకున్నాను

వెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకొనేందుకు గ్రామం నుంచి 10 మంది కలిసి వచ్చాం. దర్శనం చేసుకుని తిరిగి బయటకు వస్తున్న సమయంలో గేటు మూసి వేశారు. మధ్య లోపులాట జరగడంతో మెట్ల పైనుంచి కిందకు పడిపోయాను. చనిపోతానని అనుకున్న. నాకు ఒక వ్యక్తి బయటకు తీయడంతో తృటిలో తప్పించుకున్నాను. నా పక్కన ఉన్న చిన్ని యశోద చూస్తుండగానే చనిపోయింది.

- కొరాయి శీలమ్మ, శివరాంపురం, నందిగాం మండలం

20 మందితో కలిసి వచ్చాం

గ్రామం నుంచి 20 మందితో వెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చారు. లైన్ మధ్యలో ఉండిపోయాం. తప్పించుకొని అంతమంది బయటకు వెళ్ళిపోయారు. నేను మధ్యలో చిక్కుకున్నాను. విషయం తెలుసుకున్న మిగిలిన వారు వచ్చి నన్ను కాపాడారు.

- బొద్దు మమత, అంజలాపురం, టెక్కలి మండలం



మృతదేహాలను పరిశీలిస్తున్న కృష్ణదాస్, అప్పలరాజు

పలువురు పరామర్శ

ఘటన సమాచారం తెలిసిన వెంటనే మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే గౌతు శిరీష, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వర్ రెడ్డి, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పలాస చేరుకుని సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. మాజీ మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్ తదితరులు కూడా ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఆలయ ప్రాంగణంలో డాక్టర్ అప్పలరాజు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స నిర్వహించి ఆస్పత్రులకు రిఫర్ చేశారు. ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్, పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్, టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జనసేన జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్య నారాయణ (నాని), ఎపి మహిళా సమైక్య రాష్ట్ర అధ్యక్షులు విమల, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకటరావు, సిపిఐ రాష్ట్ర నాయకులు చాపర సుందర్‌లాల్, ఎఐవైఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యుగంధర్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి ఎన్.హరికృష్ణ, పరామర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

పలాస : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్టీల్ రీలింగ్‌ను పట్టుకొని వస్తున్న తరుణంలో అది విరిగిపోవడం యాత్రికులు ఒకరుపై ఒకరు పడిపోవడం ఆందోళన చెంచడంతో ఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రులను వెంటనే పలాస ఆస్పత్రికి తరలించారు. రెండు వేలు జనాభా వస్తారు అనుకున్నారు నిర్వాహకులు ఊహకు మంచి యాత్రికులు వచ్చారు. అప్పటికే ఆరు పోలీసు సిబ్బందిని ఆలయం వద్ద నియమించారు. ఏదేమైనా ఈ ఘటన దురదృష్టకరం. బాదిత కుటుంబాలకు ఆదుకుంటాం.

రెయిలింగ్ కూలడంతోనే...

పలాస : కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి మెట వద్ద ఉన్న రెయిలింగ్ కూలడంతో కొంతమంది మహిళా యాత్రికులు కింద పడ్డారని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మిగిలిన యాత్రికులు వారిపై పడడంతో ఈ ప్రమాదం జరిగిందని గుర్తించామన్నారు. ఎనిమిది మంది మహిళలు, బాలుడు ఈ ఘటనలో మృత్యువాత పడ్డారని తెలిపారు. మృతదేహాలను పలాస ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని తెలిపారు. మృతదేహాలను నేరుగా పోలిస్ కానిస్టేబుల్ సహాయంతో స్వగ్రామాలకు పంపించామని చెప్పారు. అంత్యక్రియలు నిమిత్తం రూ.10 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశామన్నారు. 15 మంది క్షతగాత్రులకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

దురదృష్టకరం

ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస : కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో తొమ్మిది మంది మృత్యువాత పడడం దురదృష్టకరం. మృతదేహాలను చూసి చలించిపోయాను. ఇటువంటి ఘటనా పలాసలో జరగడం చాలా బాధేసింది. 94 ఏళ్ల వృద్ధుడు తన సొంత పొలంలో ఆలయ కట్టడంతో దానిని చూసేందుకు 70 శాతం మంది యాత్రికులు మొదటిసారిగా వచ్చారు. ఆలయంలోకి వెళ్లి, వెళ్ళి వచ్చిన రోడ్డు ఒకేచోట ఉండడంతో స్టీల్ గేట్లు విరిగి యాత్రికుల మృతికి కారణమైంది.

ఒక్కో హామీ అమలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- నందిగాం

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఒక్కో హామీ అమలు చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నరేంద్రపురం వద్ద రూ.1.97 లక్షలతో వల్లభనాయుడుపేట వెళ్లే రోడ్డుకు, వల్లభనాయుడుపేట కూడలి నుంచి రామచంద్రాపురం వరకు రూ.1.10 కోట్లతో నిర్మించనున్న రోడ్డుకు శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే కొండపేట కూడలి నుంచి మొద్దవాడ వరకు రూ.1.22 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులను ప్రారంభించారు. వల్లభనాయుడుపేట నుంచి వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి వరకు రూ.85 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టిన రహదారిని ప్రారంభించారు. అనంతరం పేటలో వృద్ధులకు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా హామీలు నెరవేరుస్తున్నామని అన్నారు. మొంథా తుపాను కారణంగా నష్టపోయిన రైతులకు వ్యవసాయశాఖ అధికారులతో అంచనా వేయించి ఆదుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్, ఎంపిడిఒ కుమార్ పట్నాయక్, కిరణ్‌కుమార్, సోమేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ, ఎస్.జానకిరామ్ కూర్మినాయుడు, జీరు మోహనరావు, కె.ప్రసాదరావు, ఎ.రవిప్రసాద్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఆచూకీ లేని అమాత్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తుపాన్లు, విపత్తుల వేళ ప్రజలకు అండగా ఉండి వారికి భరోసా కల్పించాల్సిన ముగ్గురు మంత్రులు పత్తా లేకుండా పోయారు. తుపాను హెచ్చరికలు వస్తున్నాయంటే జిల్లాలోనే ఉండి ప్రజల యోగ క్షేమాల కోసం పని చేయాల్సిన అమాత్యులు ముగ్గురూ అది తమ పని కాదని, అధికారులే చూసుకుంటారన్నట్లుగా ఉంది కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీరు. అధికారులు అంతా చూసుకుంటారని అనుకున్నా జిల్లా అధికార యంత్రాంగాన్ని నడిపించే కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సైతం గురువారం వరకు సెలవు పెట్టారు. దీంతో జిల్లాలో తుపాను ఎదుర్కొనే బాధ్యతలను జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అధికారులతో కలిసి తన శక్తి మేర పని చేసి సాధ్యమైనంత వరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికార యంత్రాంగాన్ని నడిపించారు. జోరు వానలోనూ గార, శ్రీకాకుళం మండలాల్లోని తీర ప్రాంత గ్రామాలను సందర్శించి వారికి భరోసా కల్పించారు. తుపాను ప్రభావం తగ్గిన తర్వాత కూడా బహుదా నది ఉధృతి, ముంపు సమస్యలను తెలుసుకునేందుకు ఇచ్ఛాపురంలో పర్యటించారు. తుపాను తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాకు ఐఎఎస్ అధికారి చక్రధర్‌బాబును ప్రత్యేక అధికారిగా నియమించింది. ప్రభుత్వం తీవ్రతను గుర్తించినా మంత్రులెవరూ దానిని సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించడం లేదు. మొంథా తుపాను ముందు రోజు వరకు జిల్లాలోనే ఉన్న వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సరిగ్గా తుపాను ప్రభావం చూపుతున్న సమయంలోనే కోనసీమకు పయనమయ్యారు. అమలాపురంలో తీరం దాటుతుందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇన్‌ఛార్జి మంత్రిగా ఆయన అక్కడికి వెళ్లి ఉండొచ్చు. మరి మన జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా ఉన్న కొండపల్లి శ్రీనివాస్ ఇక్కడ తుపాను పరిస్థితులపై సమీక్షించాలి కదా! ఆయన కూడా రాలేదు. రెండు రోజులు విజయనగరం కలెక్టరేట్‌లోనూ, ఒక రోజు తన సొంత నియోజకవర్గంలోనూ ఉండిపోయారు. ఇక కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు విషయం ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. సాధారణ రోజుల్లో చుట్టపు చూపుగా వచ్చే అమాత్యులు తుపాను సమయంలోనూ అదే సంప్రదాయం పాటించారు. జిల్లా ప్రజలు, రైతులు ఎలా ఉన్నారో ముగ్గురు మంత్రులకు అడిగే తీరిక లేకుండా పోయింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాత్రం మేఘసందేశం (వర్షాలపై సమాచారం) వస్తున్నప్పుడల్లా వారూ ఒక వాట్సస్ సందేశం తమ పిఆర్‌ఒల ద్వారా మీడియాకు పంపేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి, మత్స్యకారులెవరూ వేటకు వెళ్లొద్దు, సముద్రం అల్లకల్లోలంగా ఉంటుంది. ఇలా ఉంది వాట్సప్‌ల్లో వారు పంపిన సందేశం. తుపాను వచ్చినప్పుడు ఇవి సర్వసాధారణంగా ఉండేవే. వాటినే ప్రజలకు సందేశం రూపంలో పంపేశారు. ఇంతకీ అవి అమాత్యులు స్వయంగా వారితో మాట్లాడిన పలుకులేనా అన్న సందేహాలూ ఉన్నాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విదేశాల్లో ఉంటే 'శ్రీకాకుళం మీడియా టీం అచ్చెన్న' గ్రూపులో ఆయనతో మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్‌లో మాట్లాడినట్లు పోస్టు చేయడం గమనార్హం. దీంతో అవి ఉత్తుత్తి ఫోన్లే అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు తుపాను ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత శనివారం జిల్లాకు వస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు ముంపు బారిన పడిన రైతుల కష్టాలను వినడానికి సమయం కేటాయిస్తున్నా రంటే అదీ లేదు. ఆయన పర్యటన షెడ్యూల్‌లో నందిగాం, టెక్కలిలో పలు శంకుస్థాపన కార్యక్రమాలు ఉన్నాయి తప్ప వర్షాలతో ముంపు బారిన పడిన పొలాలను పరిశీలించేందుకు సమయం వెచ్చించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తానూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చానని, రైతుల కష్టం తెలుసుని ఎప్పుడూ చెప్పుకునే మంత్రి అచ్చెన్నాయుడు కష్టాల్లో ఉన్న రైతులను పలకరించడానికి తీరిక లేకపోవడమేమిటనే అంతా అనుకుంటున్నారు.

మొంథా తుపానుతో ఎడతెరిపి లేకుండా నాలుగు రోజులు పాటు కురిసిన వర్షాలు, ఇబ్బందులతో జనం ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. సాదారణ జనజీవనం కుదుటపడినా రైతులు ఇప్పుడిప్పుడే కోలుకునేలా లేరు. భారీ వర్షాలు పంట పొలాలను ముంచెత్తడంతో ఐదు రోజులు గడుస్తున్నా నేటికీ వరి చేలు నీటిలోనే నానుతోంది. పంట చేతికొచ్చే సమయానికి కురిసిన భారీ వర్షాలతో పలుచోట్ల వరి పంట తుడుచుపెట్టుకు పోయింది. పంట ఖర్చులు కూడా రావంటూ రైతులు కన్నీరుమున్నీరవుతు న్నారు. నాలుగు రోజులుగా వరి చేలు నీటిలోనే నానుతుండటంతో రంగు మారే ప్రమాదముండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రంగు మారిన ధాన్యం కొనుగోలు చేయడంపై స్పష్టమైన ప్రకటన చేయాలంటూ గత నెలలో రైతులు, మిల్లర్లతో జెడ్‌పిలో నిర్వహించిన సమావేశంలో ఎపి రైతు సంఘం నాయకులు కోరినా ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఒక స్పష్టమైన ప్రకటన రాలేదు. ప్రభుత్వం ఆ ధాన్యం కొనుగోలు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉంది. పత్తి పంటకూ నష్టం వాటిల్లినట్లు అధికారుల ప్రాథమిక అంచనాలు చెప్తున్నాయి. అరటి, బొప్పాయి, జీడి, కొబ్బరి, కూరగాయల తదితర ఉద్యాన పంటలకూ నష్టం వచ్చింది. పంట ఖర్చుల కింద వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి అప్పులపాలయ్యామంటూ రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. తుపాను ప్రభావంతో ఇళ్లు కోల్పోయివారూ ఉన్నారు. ఓట్ల కోసం ఇంటింటికీ వెళ్లే మంత్రులు ప్రజలు కష్టకాలంలో ఉన్నప్పుడు తమను ఓదార్చడానికి కనీసం సమయం కూడా కేటాయించకపోవడం విచారకరం.


కూలిన గోడను పరిశీలిస్తున్న విప్ అశోక్

బాధితులకు అండగా ఉంటాం

ప్రభుత్వ విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

తుపాను ప్రభావంతో పంటలు, ఇళ్లు నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు మండలంలోని జగతిలో పులకల మల్లేశ్వరరావుకు చెందిన మట్టి గోడ కూలిపోయింది. శనివారం ఆ ఇంటిని సందర్శించిన విప్ అశోక్ బాధితులతో మాట్లాడి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పూర్తి వివరాలు రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు. అనంతరం బొరివంకలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శివాలయం నూతన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చినబాబు, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, ఎంపిటిసి మాజీ సభ్యులు బెందాళం విజయ్ కృష్ణ, శమల్ల సర్వేశ్వరరావు, కార్యదర్శులు గుణవతి, రవి కుమార్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న రైతులు

పంటలను కాపాడాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని వేములవాడ, విశ్వనాథపురం దాలి ట్యాంకు ముంపు నుంచి వరి పంటలను కాపాడాలని రైతు సంఘం, సిపిఎం నాయకులు బమ్మిడి సోమేశ్వరరావు, నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద తొలుసూరుపల్లి మాజీ సర్పంచ్ బమ్మిడి అప్పలనాయుడు ఆధ్వర్యాన శనివారం నిరసన తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలు వల్ల దాలి చెరువులోకి చేరిన వరద గతంలో చెరువు లోపల ర్యాంపు తవ్వి పెద్దగట్టు వేశారని అన్నారు. ఆ గట్టు దాటి వంద మీటర్ల వరకు నీరు పంట పొలాల్లో నిల్వ ఉండిపోతుందని అన్నారు. చేతికి వచ్చే పంట నీట మునిగి కుళ్లిపోతోందని రైతులు వాపోయారు. జయకృష్ణాపురం, మోదుగువలస, బన్నువాడ, మున్సఫ్‌పేట, శ్రీరంగం, గోపీనాథపురం, వేములవాడకు చెందిన వంద ఎకరాల్లో చేతికి అందాల్సిన పంటల నాశనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు జోక్యం చేసుకొని చెరువులోని అదనపు నీటిని తగ్గించాలని కోరుతున్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వంజంగి శ్రీనివాసరావు, బెండి కూర్మారావు, మెట్ట సీతమ్మ, కణితి ఇందిరమ్మ, సత్తారు అమ్మోజీ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సిఎం అభినందనలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మొంథా తుపాను సమయంలో ఉత్తమ సేవలు అందించిన తహశీల్దార్ ఎన్.వెంకటరావుకు సిఎం చంద్రబాబు నాయుడు శుక్రవారం విజయవాడలో సిఎం క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. తహశీల్దార్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలను సమర్థవంతంగా అమలు చేయడం వంటి పనులు చేపట్టారు. 'ఇలాంటి కర్తవ్య నిబద్ధత ఉన్న అధికారులు ప్రభుత్వానికి గర్వకారణం' అని సిఎం అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అధికారులు, నాయకులు తహశీల్దార్‌కు అభినందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమం

ప్రజాశక్తి- అరసవల్లి

శ్రీకాకుళం రంగస్థల కళాకారులు సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం బాపూజీ కళామందిర్‌లో 313వ నెల సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ రంగస్థల నటులు కలగ లక్ష్మయ్య 25వ వర్ధంతి సందర్భంగా కుటుంబసభ్యుల సౌజన్యంతో సత్య హరిచంద్ర వారణాసి సీన్, చింతామణి - భవాని సీన్ పౌరాణిక నాటకాల సీన్‌లు ప్రదర్శించారు. కార్యనిర్వాహక అధ్యక్షులు పన్నాల నరసింహామూర్తి ఆధ్వర్యంలో సభా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నగరకాపు సంఘం అధ్యక్షులు రవీంద్రనాథ్ టాగూరు, నల్లి ధర్మారావు, మాజీ సర్పంచ్ కలగ శివకుమార్, మారుతిప్రసాద్, జి.కృష్ణ, ఎల్.రామ లింగస్వామి, కలగ అధికేశవులు తదితరులు పాల్గొన్నారు.

కూల్చివేసిన అంగన్వాడీ స్థలం పరిశీలన

పొందూరు: మండలంలోని కొంచాడలో అర్ధరాత్రి అంగన్వాడీ కేంద్రాన్ని కూల్చివేసిన స్థలాన్ని శనివారం సిడిపిఒ బి.అనూరాధ పరిశీలించారు. గ్రామంలో సచివాలయం ఎదురుగా ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి కూల్చివేసి శిథిలాలు కూడా లేకుండా తరలించేశారు. దీనిపై సెక్రటరీ శ్రీనివాసరావు, విఆర్ఒ ప్రకాశరావు ఉన్నతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేయడం కూడా జరిగింది. దీనిపై గ్రామంలో సిడిపిఒ అనూరాధ విచారించగా ఇంతకుముందు ఉన్న స్థలంలో మరలా కొత్తగా అంగన్వాడీ భవనం నిర్మించు కోవాలని, మిగిలిన స్థలంలో రామమందిరం నిర్మించుకుంటామంటూ పలువురు గ్రామస్తులు సంతకాలు చేసి ఆమెకు అందజేసినట్లు తెలిపారు. దీంతో తమ అంగన్వాడీ భవనం స్థలం హద్దులను గుర్తించి తమకు అప్పగించాలని కోరుతూ ఎంపిడిఒ, తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని ఆమె అందజేశారు. ఈమెతో పాటు సూపర్‌వైజర్ సుజాత ఉన్నారు.


గ్రామస్తులను విచారిస్తున్న సిడిపిఒ అనూరాధ

బస్ షెల్టర్ లేక అవస్థలు

మెళియాపుట్టి : మండలంలో పలుచోట్ల బస్సు షెల్టర్ సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం వేచి ఉండే సమయాల్లో బస్సు షెల్టర్ సౌకర్యం లేక ఎండ, వానలకు ఇబ్బంది పడాల్సి ఉంటుందని అంటున్నారు. మండలంలో బురదరామచంద్రాపురం, ఎగువ జాడుపల్లి, పదనాపురం, బంజీరు కూడళ్ల వద్ద బస్ షెల్టర్ సౌకర్యం లేదు. సిరియాకండి వద్ద ఉన్న బస్సు షెల్టర్ పూర్తిగా శిథిలమైంది. బస్ షెల్టర్ సౌకర్యం అభివృద్ధి పరిచేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


బస్ షెల్టర్‌కు నోచుకోని బురదరామచంద్రపురం కూడలి

ఎచ్చెర్ల జనసేనలో లుకలుకలు

- నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్‌పై అసంతృప్తి
- సీనియర్ల ఆత్మాభిమాన సమావేశం
- త్వరలో పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి- రణస్థలం

జనసేన ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఎస్.విశ్వక్సేన్ నివురుగప్పిన నిప్పులా ఉన్నా అసంతృప్తి కుంపట్లు రాజుకుంటున్నాయి. మొదటి నుంచి పార్టీలో ఉంటూ అంకితభావంతో పనిచేస్తూ వస్తున్న తమను విస్మరిస్తున్నారని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేస్తూ తమను ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలువురు సీనియర్లు అసంతృప్తి గళం వినిపిస్తున్నారు. ఆత్మాభిమానం పేరిట తమ అసంతృప్తిని చాటేందుకు వారు ఇటీవల రణస్థలం మండల కేంద్రంలో కొత్త పెట్రోల్ బంక్ వెనుక ఉన్న మామిడితోటలో ఎచ్చెర్ల నియోజకవర్గానికి సంబంధించి రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడాం మండలాలకు చెందిన మొదటి నుంచి పార్టీలో ఉన్న సీనియర్ నాయకులు ఆత్మాభిమాన సమావేశమయ్యారు.

సీనియర్లుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆవేదన

ఎచ్చెర్ల నియోజకవర్గంలో జనసేన ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన మహిళా నాయకులు ఎస్.కాంతిశ్రీ జనసేన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని పార్టీలో అందరినీ కలుపుకుని చాలా కార్యక్రమాలు చేసి సీనియర్లను చాలా గౌరవించేవారని, కాంతిశ్రీ మృతి చెందిన తరువాత ఎచ్చెర్ల జనసేన ఇన్‌ఛార్జిగా


ఆత్మాభిమాన సమావేశంలో పాల్గొన్న సీనియర్ నాయకులు (ఫైల్)

కాంతిశ్రీ కుమారుడు ఎస్.విశ్వక్సేన్‌కు పదవి ఇచ్చిన తరువాత పార్టీలో మొదటి నుంచి ఉన్న సీనియర్లను పక్కనపెట్టి పార్టీలో కొత్తగా వచ్చిన వారిని అందలం ఎక్కించి భజన చేసిన వారికి, ఆయనపై పువ్వులు చల్లిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల తరువాత పూర్తిగా సీనియర్లకు ప్రాధాన్యం లేకుండా పోయిందని, ఇతర పార్టీల నుంచి చేర్చుకున్న వారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. సిద్ధాంతాలకు కట్టుబడి, కష్టనష్టాలకు గురై, త్యాగాలు చేసిన వారిని విస్మరిస్తున్నారని అన్నట్లు సమాచారం. ఈ చర్య తమ ఆత్మాభిమానాన్ని, ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తుందని పలువురు ఆక్షేపించినట్లు తెలిసింది. పరిస్థితిలో ఏమైనా మార్పు రాకపోతుందా అని ఓపికపట్టి, అలాంటి వాతావరణం ఏం కనబడనందున తమ ఆత్మాభిమానాన్ని, అసంతృప్తిని రాష్ట్రస్థాయి నాయకత్వానికి తెలిసేలా చేసేందుకు కార్యాచరణ రూపొందించుకోవాలని ఈ సమావేశంలో పాల్గొన్నవారు నిర్ణయించుకున్నారని తెలిసింది. ఇప్పటికే పలుమార్లు రాష్ట్రస్థాయిలో ఉన్న నాయకులను కలిసి తమగోడు వెళ్లబోసుకున్నా స్పందన రాకపోవడంతో ఆత్మాభిమాన సమావేశాలు నిర్వహించడమే మార్గమని వారు అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం.

కనీస సమాచారం ఇవ్వడం లేదని...

గత ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసిన నాయకుల కోసం, పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకు సమావేశాలకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు నిర్వహిస్తూ అగౌరవపరుస్తున్నారని పలువురు అన్నట్లు తెలిసింది. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీచైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీకాకుళంలో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి కూడా సమాచారం లేదని, అలాగే నిడదవోలు ఎమ్మెల్యే కందుల లక్ష్మి దుర్గేష్ ప్రసాద్ రాజాం వచ్చినప్పుడు కూడా సమాచారం లేదని, అలాగే కొణిదెల నాగేంద్రబాబు ఎచ్చెర్ల నియోజకవర్గం జి.సిగడాం మండలంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చినప్పుడు, లావేరు మండలంలోని జనసేన పార్టీ కార్యాలయం శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చినప్పుడు కూడా సమాచారం గాని, పిలుపు గాని రాలేదని ఆరోపించారు. ఇటీవల రాబోయే రోజుల్లో ప్రత్యామ్నాయ కార్యక్రమాలను నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఆత్మాభిమాన సభల పేరిట అసంతృప్తి సమావేశం మరోమారు నిర్వహించి ఆత్మాభిమాన సభ పేరిట పెద్ద సభను నిర్వహించాలని నిర్ణయించడం జరిగినట్లు తెలిసింది. అనంతరం పార్టీ పెద్దల దృష్టికి తీసుకుని వెళ్లి ఈసమస్యపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న వై.పర్త గ్రామస్తులు

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే దృష్టికి గ్రామ సమస్యలు

ప్రజాశక్తి- బూర్జ

అధికారులు విధి నిర్వహణలో ఆలసత్వం వద్దని, బాధ్యత లేకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎమ్మెల్యే రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని లక్కుపురంలో పర్యటించిన సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, కాలువల్లో పూడికలు తీయకపోవడంతో దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో సమస్యలు ఉన్నప్పటికీ అధికారులు ఏం చేస్తున్నారని ఎంపిడిఒ తిరుపతిరావు, ఇతర సిబ్బందిని ప్రశ్నించారు. ఇప్పటికైనా పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. గ్రామంలో ఉన్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఇఒపిఆర్‌డిని ఆదేశించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామంలో ఉన్న పరిస్థితులను పరిశీలించి సమస్యను తన దృష్టికి తీసుకువస్తే అవసరమైన నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అలాగే గ్రామస్తులు కూడా తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రభుత్వం మరుగుదొడ్లు మంజూరు చేయడం జరిగిందని, అయితే వాటిని నిరూపయోగంగా వదిలేయడం సరికాదన్నారు. సచివాలయ సిబ్బంది గ్రామస్తులు ఎవరు ఆరుబయట మలవిసర్జన చేయకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్తులు తీసుకు రాగా దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

వై.పర్తను పంచాయతీగా చేయాలి

వై.పర్త గ్రామాన్ని పంచాయతీగా చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వై.పర్త గ్రామం డొంకలపర్త గ్రామ పంచాయతీలో ఉందని తెలిపారు. పంచాయతీకి వెళ్లాలంటే పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మీదుగా 12 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఉందని ఎమ్మెల్యేకు తెలిపారు. ఇక్కడ పనుకుపర్త గ్రామంలో వై.పర్త కలిపి ఒకే పంచాయతీ చేసినట్లయితే అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

భద్రతా వైఫల్యమే కారణం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన యాత్రికులు క్యూలో పెట్టి దర్శనం సక్రమంగా నిర్వహించే విధంగా చూసే నాథుడు లేక తొక్కిసలాట జరిగి తొమ్మిది మంది మృతి చెందారని సిపిఎం నాయకులు బి.ఆనందరావు, ఎన్.మోహనరావు ఆందోళన వ్యక్తం చేశారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.15 లక్షలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మంత్రి, ఎమ్మెల్యే వస్తున్నారంటే కొన్ని గంటలు, ముందు నుంచే పహరా కాసిన పోలీసు యంత్రాంగం ఇంత పెద్ద ఎత్తున జనాలు వస్తారంటే ఎందుకు స్పందించి కాపలా పెట్టలేదని ప్రశ్నించారు. ముందు పోలీస్ యంత్రాంగంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- లావేరు

బుడుమూరులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన బాధితులకు ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, పక్కా గృహాలను మంజూరు చేయాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం బాధితులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం నిత్యావసర సరుకులు, బట్టలు పంపిణీ చేశారు.

నారీ శక్తి యాప్‌పై అవగాహన

నరసన్నపేట: స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో మహిళలకు నారీ శక్తిపై ఎఎస్ఐ తులసినాయుడు శనివారం అవగాహన కల్పించారు. మహిళలు సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ట్విట్టర్, ఫేస్ బుక్, ఆన్‌లైన్ ఎంత ఉపయోగకరంగా ఉన్నాయో, అలాగే వాటి పట్ల అశ్రద్ధగా వహిస్తే జరిగే నష్టాలు గురించి కూడా వివరించారు. బాలుర కోసం సంకల్పం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విద్యార్థులు మద్యానికి, పొగాకు, గంజాయి, హెరాయిన్, కొకైన్ కొన్ని రకమైన మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, ఎఒ జగన్నాథరావు పాల్గొన్నారు.


అభినందిస్తున్న దేవరాజు

విద్యార్థులకు పోటీలు

సోంపేట: స్వామివివేకానంద జయంతిని పురస్కరించుకుని భారత ప్రభుత్వం జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా మండల స్థాయి యువజన ఉత్సవాల పోటీలు సోంపేట ప్రభుత్వ కాలేజ్ ఆధ్వర్యాన శనివారం చేపట్టారు. స్థానిక సంస్కార భారతి జూనియర్ కాలేజ్ నుంచి విద్యార్థి, విద్యార్థినులు పాల్గొని జానపద నృత్యం, జానపద పాట, పెయింటింగ్, సైన్స్ ప్రాజెక్టు (చంద్రయాన్) మొదలగు నాలుగు విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించారు. సందర్భంగా కళాశాల చైర్మన్ వై.దేవరాజు, సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ నిమ్మన దాసు, ప్రిన్సిపాల్ బి.కవిబాబు, బి.శ్రీరామ్మూర్తి, ఎఒ వి.పాపారావు అభినందించారు.

పశువులకు వైద్య పరీక్షలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యాన నిర్వహిం చిన జాతీయ సేవా శిబిరాలు నిర్వహణలో భాగంగా మండలంలోని సవ రకిల్లి, సన్యాసి నీలాపురం, డమర గ్రామాల్లో శనివారం పశువైద్య శిబిరాలు నిర్వహించారు. లింగాలవలస పశువైద్య కేంద్రానికి చెందిన డాక్టర్ ఎం. పూర్ణచంద్రరావు నేతృత్వంలో శిభిరాలు చేపట్టారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు సంబవిస్తున్న రోగాలు నివారణ దృష్ట్యా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శిబిరంలో భాగంగా రైతులకు మందులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయసేవా విభాగం పిఒ డి.వాసుబాబు, వి.లూక్‌పాల్, పశువైద్య సిబ్బంది లక్ష్మీనారాయణ, నీలవేణి పాల్గొన్నారు.


పశువైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మొంథా తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు తగ్గినా పంట పొలాల్లో నీరు ఇంకా నిల్వ ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం ఆదుకోకుండా చోద్యం చూస్తుందని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ విమర్శించారు. శనివారం మండలంలోని రామచంద్రాపురం, తొగరాం గ్రామాల పరిధిలోని నీట మునిగిన వరి పంట పొలాలను సందర్శించి రైతులను పరామర్శించి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటిపాలై నష్టపోతున్నప్పటికీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఎవరూ స్పందించకపోవడం దారుణమని, ఇది రైతు ద్రోహమన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సిఎంగా ఉన్న సమయంలో రైతులకు పంట నష్టపరిహారం సకాలంలో అందించి ఆదుకున్నారని, ప్రస్తుత ప్రభుత్వం రైతులపై పూర్తిగా నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తోందన్నారు. రైతుల ఆవేదనను వెంటనే గుర్తించి పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రవికుమార్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చల్ల సింహాచలం, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


పంట పొలాన్ని పరిశీలిస్తున్న రవికుమార్


పట్టాలు పొందిన ఇంజినీరింగ్ విద్యార్థులు

నిరంతర శ్రమే విజయానికి సోపానం

టెక్కలి రూరల్: టెక్కలి ఐతమ్ కళాశాలలో తొమ్మిదో పట్టభద్రుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించామని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ వేడుకకు విజయనగరం జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వెంకట సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే నిరంతర శ్రమ తప్పనిసరని అన్నారు. విద్యార్థులు కేవలం డిగ్రీలకే పరిమితం కాకుండా నూతన సాంకేతిక పరిజ్ఞానం సాధించాలన్నారు. సమాజంలోని సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు చూపడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి ప్రతి విద్యార్థిలో ఉండాలని పేర్కొన్నారు. గవర్నింగ్ బాడీ చైర్మన్ ప్రొఫెసర్ పి.వి.జి.డి.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని క్రమశిక్షణతో ముందుకు సాగితే విజయమే తథ్యమన్నారు. ఐతమ్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె. సోమేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ సంస్థాగత ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్‌లో ఐతమ్ 201 నుంచి 300 బాండ్ ర్యాంక్ సాధించిందన్నారు. ఈ వేడుకలో మొత్తం 263 మంది విద్యార్థులకు ఇంజనీరింగ్ పట్టాలు, 8 మంది ప్రతిభావంతుల విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వి.చిట్టిబాబు, సొసైటీ డైరెక్టర్లు కొంచాడ మధుకుమార్, టంకాల నాగశేషు, కార్యదర్శి ఎల్.ఎల్.నాయుడు, కోశాధికారి టంకాల నాగరాజు పాల్గొన్నారు.

3న అన్న క్యాంటీన్ ప్రారంభం

కోటబొమ్మాళి: స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్ ఈ నెల 3న వ్యవసాయశాఖమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించనున్నట్లు టిడిపి నాయకులు తెలిపారు. గత ప్రభుత్వంలో 223 రోజులు పాటు మంత్రి అచ్చెన్నాయుడు సొంత ఖర్చులతో క్యాంటీన్ నిర్వహించారని అన్నారు. ప్రభుత్వం వచ్చిన తరువాత శనివారం నాటికి 353 రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్ పేదలు వినియోగించుకోవాలని కోరారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అన్న క్యాంటీన్


ఆమదాలవలస : విజేతలతో ఎంఇఒ రాములు, ఉపాధ్యాయులు

విజేతలకు అభినందన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇచ్ఛాపురం నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను విద్యాశాఖ ఆదేశానుసారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో నియోజకవర్గం నుంచి 12 మంది విద్యార్థులు పాల్గొనగా, వీరిలో ముగ్గురు విద్యార్థుల్ని విజేతలుగా నిలిచారు. విజేతలలో. కంచిలి మోడల్ స్కూల్ విద్యార్థి మండలం మొదటి స్థానం కె.స్నేహ జెడ్‌పి కొత్త శాసనం ఇచ్ఛాపురం మండలం ద్వితీయ స్థానం, ఆర్.వెన్నెల సోంపేట మోడల్ స్కూల్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలను ఆంధ్రపదేశ్ అసెంబ్లీకి సందర్శన నిమిత్తం ప్రభుత్వం వెళ్లనున్నారని ఎంఇఒలు కురమాన అప్పారావు, ఎస్. విశ్వనాథం తెలిపారు. ఇంతమంచి అవకాశాన్ని విద్యార్థులకు కల్పించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎంఇఒలు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. విజేతలైన విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమానికి వమ్మరవల్లి డైట్ అధ్యాప కులు శరత్‌కుమార్, జిల్లా అధికారి ప్రతినిధిగా పాల్గొన్నారు. నాలుగు మండలాల ఎంఇఒలు కురమాన అప్పారావు, విశ్వ నాథం, ఎం.ధనుంజయ, చిట్టిబాబు, స్థానిక హెచ్‌ఎంలు కె. సూర్యారావు, ఉపాధ్యాయులు, సిఆర్‌ఎంటిలు ఆర్.దేవరాజు, సోమేశ్వరరావు, సత్యనారాయణ, మోహన రావు, బి.గణేష్, ఆర్.తులసీరావు పాల్గొన్నారు.

ఆముదాలవలస: రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. క్విజ్ పోటీల్లో మొదటి స్థానం బూర్జ మండలం ఒవిపేట ఎపిమోడల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి కొనపల సాయి దీక్షిత్ ఎంపికయ్యాడు. ఆమదాలవలస మండలంలోని కొర్లకోట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని కిల్లి సంధ్య, పదవ తరగతి రెండవ స్థానం. సరుబుజ్జిలి మండలం కాగితాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సురవరపు ఝాన్సీ, పదవ తరగతి విద్యార్థిని మూడవ స్థానం సాధించారు. ఈ ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరగబోయే మాక్ అసెంబ్లీలో పాల్గొంటారని మండల ఎంఇఒలు కె.ఎ రాములు, టి.రాజు తెలిపారు. కార్యక్రమంలో జ్యూడీ సభ్యులు 12 మంది, ఆముదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాల ఎంఇఒలు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం : అభినందిస్తున్న ఎంఇఒలు


తారకేష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ (ఇన్‌సెట్‌లో తారకేష్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక కూడలి సమీపంలోని ఇండేన్ గ్యాస్ గోదాం ఎదురుగా శనివారం ఉదయం జరిగిన రహదారి ప్రమాదంలో శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దపాడుకు చెందిన కలగ తారకేష్ (19) అనే యువకుడు మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు తారకేష్ కృష్ణాపురంలో తాపీపని చేసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో వెనుకచక్రాల కిందపడి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుడు సుమారు ఐదేళ్లుగా మండలంలోని కొంచాడలో తమ పెద్దమ్మ దగ్గర ఉంటూనే తాపీపనులు చేసుకుంటున్నాడు. ఎప్పటిలాగే కృష్ణాపురంలో తాపీపని చేసేందుకు వెళ్లేందుకు ఇంటినుంచి వెళ్లాగా లారీ రూపంలో మృత్యువు కభళించింది. లారీ ముందు భాగంలోని చక్రాల కింద ద్విచక్రవాహనం ఉండిపోగా, యువకుడు వెనుక చక్రాల కింద తల నలిగిపోయి చనిపోయాడు. ప్రమాదం విషయం తెలియడంతో వెంటనే కొంచాడలో ఉన్న కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని రోధించారు. మృతుడు పెద్దమ్మ కుమారుడు ఇద్దుబోయిన రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.


పరామర్శిస్తున్న సంతోష్

పాన్‌షాపు దగ్ధం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో సంతపేట మెయిన్ రోడ్డుపై ఉన్న జాజిల రాజు పాన్‌షాపు శుక్రవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో షాపులోని మొత్తం సామగ్రి అగ్నికి ఆహుతైంది. రాత్రి సమయంలో సమాచారం అందుకున్న షాపు యజమాని వచ్చేసరికి స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.రెండున్నర లక్షలు నష్టం వాట్టిందని అంచనా వేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించినట్లు బాధితుడు రాజు తెలిపారు. 17 వార్డు టిడిపి ఇన్‌ఛార్జి జన్నెల సంతోష్ బాధితుడిని పరామర్శించారు. ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీనిచ్చారు.


చెక్కును అందజేస్తున్న మాజీ ఎంపిపి ప్రమీల

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలు బాధిత కుటుంబాలకు శనివారం ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని రాపాకలో యలకల రాజు కుటుంబ సభ్యులకు రూ.1,97,400, తుంగపేటకు చెందిన కె.దమయంతి కుటుంబానికి రూ.5,11,751, మజ్జిలిపేటకు చెందిన జి.ఉమాశంకర్ కుటుంబానికి రూ.54,600 చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, సర్పంచ్ పప్పల వేణుగోపాలం, కూటమి నాయకులు కండాపు శ్రీనివాసరావు, కొంచాడ బుజ్జి, చిన్నంనాయుడు, జనకచక్రవర్తి, రమణ, గొల్లయ్య, సురేష్, పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తుపాను బాధితులకు నిత్యావసర సరుకులు

కవిటి: తుపాను ప్రభావానికి గురైన తీరప్రాంత మత్స్యకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయనున్నట్లు ఎఎంసి చైర్మన్ మణిచంద్ర ప్రకాష్ తెలిపారు. ఇచ్చాపురం, కవిటి మండలాలకు చెందిన 4715 కుటుంబాలకు కెజి ఉల్లి, కెజి దుంపలతో పాటు ఆయిల్, పంచదార, బియ్యం తదితర వస్తువులు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఇచ్చాపురంలో 1344, కవిటిలో 3,371 కుటుంబాలకు ఈ సరుకులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.


మణిచంద్ర ప్రకాష్

లక్ష్మణరావు మృతి బాధాకరం

ఆమదాలవలస: ప్రజా ఉద్యమ నాయకుడు, న్యాయవాది చౌదరి లక్ష్మణరావు మృతి బాధాకరమని న్యాయవాది బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శనివారం రాత్రి రాగోలులోని స్వగృహంలో గుండె పోటుతో మృతి చెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు.

కూటమి నాయకుల ఆర్థికసాయం

లావేరు: అగ్ని ప్రమాద బాధితులకు కూటమి నాయకులు పరామర్శించి కాలిపోయిన ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఒక్కొక్కరికి బెజ్జిపురం మాజీ సర్పంచ్ ఇజ్జాడ శ్రీనువాసరావు తన వ్యక్తి గతంగా రూ.2,500 చొప్పున నగదు, ఒక్కో బియ్యం బస్తాచొప్పున ముగ్గురు బాధితులకు అందజేశారు. అలాగే పెద్దకొత్తపల్లి సర్పంచ్ ఆరేళ్ల కృష్ణ తనవంతు సాయంగా నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కూనపల్లి దాము, కోనేటి శ్రీనువాసరావు, డి.అజార్, పి.రమణ, పి.అప్పల నాయుడు, బుడుమూరు సర్పంచ్ ప్రతినిధి చిట్టిబాబు, ఎంపిటిసి బొడ్డ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ఖాతాలను పునరుద్ధరించుకోవాలి

జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

బ్యాంకు ఖాతాలు పదేళ్లకుపైగా వాడకపోతే ఆ సొమ్ము రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాకు వెళ్తుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ వెల్లడించారు. దానిని వ్యక్తి లేదా కుటుంబసభ్యులు పునరిద్దుంచుకుని, ఆ నగదును పొందాలని దానికి బ్యాంకర్లు, ఇన్సూరెన్సు కంపెనీలు సహకరించాలని శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా బ్యాంకర్లు, ఇతర ఫైనాన్స్ సంస్థలు, ఇన్సూరెన్సు కంపెనీల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వానికి సంబంధించిన బధిర ఖాతాల్లో సొమ్ము రూ.9 కోట్లకుపైగా ఉందని, అలాగే సామాన్య ప్రజానీకానికి సంబంధించినది రూ.80 కోట్లు వరకు ఉన్నాయన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్ని వారికి చేరేలా బ్యాంకర్లు అవగాహన కార్యక్రమాలు కల్పించాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ లక్ష్యం కష్టార్జితం వాళ్ళ కుటుంబ సభ్యులకు చేరేలా చేయాలని లక్ష్యంగా చెప్పారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివాల సూర్యం, డ్వామా పిడి సుధాకర్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

వమరవల్లి విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో అధ్యాపకులుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిఇఒ ఎ.రవిబాబు ప్రకటనలో తెలిపారు. మూడు సినియర్, ఎనిమిది లెక్చరర్ పోస్టులు డిప్యూటేషన్‌పై నియమించనున్నట్లు చెప్పారు. ఈ నెల 3వ తేదీలోపు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లీప్ యాప్‌లో దరఖాస్తు నమూనా అందుబాటులో ఉందని చెప్పారు. పూర్తి వివరాలకు 9440973633 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

సేవలకు సమయం పెంపు

శ్రీకాకుళం సిటీ: జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో స్పీడ్ పోస్టు, పార్మిల్ కోసం అదనపు సమయం పెంచినట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు చెప్పారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఈ కౌంటర్ పనిచేస్తుందన్నారు. కోర్టులో ఉన్న ఉప తపాలా కార్యాలయం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటలు వరకు నిర్వహించనున్నట్లు చెప్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



శంకుస్థాపన చేస్తున్న టిడిపి నాయకులు

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

కోటబొమ్మాళి: మౌలిక సదుపాయాల కల్పన కూటమి ప్రభుత్వంతోనే ముమ్మరంగా జరుగుతున్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజుల అన్నారు. కోటబొమ్మాళిలోని కరణాలవీధి నుంచి ఊరమ్మతల్లి ఆలయం వరకు నిర్మించనున్న సిసి రోడ్డుకు శనివారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.50 లక్షల అంచనాల వ్యయంతో గ్రామంలో సిసి రోడ్డు నిర్మిస్తున్నామని అన్నారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా తాగునీరు అందించేందుకు రూ.600 కోట్ల వ్యయంతో ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టిందని, ఫలితంగా గ్రామంలో తాగునీటి సమస్య ఉండదని అన్నారు. అంతకుముందు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ సర్పంచ్ దేవాది సింహాద్రమ్మ, టిడిపి పట్టణ అధ్యక్షులు కోరాడ గోవిందరావు, కొత్తమ్మతల్లి ఆలయ పాలక మండలి అధ్యక్షుడు కోరాడ చిన్నగోవింద, కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి, నౌగాపు నాగరాజు, టిఎ.పంగ రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సత్యసాయి విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి పోటీలకు సత్యసాయి స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ పోటీలు పల్నాడు జిల్లా నరసరావుపేటలో 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. విద్యార్థులకు సత్యసాయి స్కూల్ డైరెక్టర్ భానుతేజ, ప్రిన్సిపాల్ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమానికి యువ సూర్య ట్రస్టు చైర్మన్ రాంబాబు, ఎంపిటిసి గోపి, పిఇటి సాన్‌మదీనా, స్విమ్మింగ్ కోచ్ బత్తుల రామారావు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



బూర్జ : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- బూర్జ

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పలాలు అందుతాయని ఎమ్మెల్యే కూన రవి కుమార్ అన్నారు. శనివారం మండలంలోని లక్కుపురంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వంలో సిఎం చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా పారదర్శకంగా అమలు చేస్తున్నామన్నారు. అంతకు ముందు గ్రామంలోని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టిడిపి మండల అధ్యక్షుడు వావిలపల్లి సీతా రాంబాబు నాయుడు, పి ఎస్‌సిఎస్ అధ్యక్షులు బగాది రామ్మూర్తి నాయుడు, కన్నంనాయుడు, చొక్కర పోలినాయుడు, కె.కృష్ణ, బెజ్జిపురం సోమనాయుడు, ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, పంచాయతీరాజ్ జెఇ ఎంబికె నాయుడు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పోలాకి: ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి నెలా ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తున్నారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. మండలంలోని మబగాంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక



మెళియాపుట్టి : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు



పోలాకి : పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కూటమి నేతలతో కలిసి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కాయ రవి, కాయ గోవిందరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురంలో ఎన్‌టిఆర్ భరోసా పింఛనును ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, డిటి కె.రాము, పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, బూర్ల లలిత కుమారి పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ మరియా జోషితను ప్రశ్నిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సెయింట్ ఆన్స్ పాఠశాలలో వివాదం

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ అన్స్ పాఠశాలలో వివాదం చోటు చేసుకుంది. శనివారం ఉదయం పాఠశాల యాజమాన్యం తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని 3వ వార్డు ఊసవాని పేటకు చెందిన 9వ తరగతి విద్యార్థి పిల్లా నికేష్ నాయుడు తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి తన కుటుంబ సభ్యులతో వెళ్లిన విషయం వివాదానికి దారి తీసింది. అక్టోబరు 9, 10వ తేదీల్లో సెలవు మంజూరు చేయాలని విద్యార్థి తండ్రి కోరినప్పటికీ పాఠశాల హెచ్‌ఎం మరియా జోషిత అనుమతి నిరాకరించినట్లు విద్యార్థి తల్లిదండ్రులు తెలిపారు. ముందుగానే రైలు, వసతి రిజర్వేషన్ చేసుకొని ఉండడంతో యధావిధిగా తిరుపతి దర్శనానికి వెళ్లారు. తిరుపతి దర్శనం అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థిపై పాఠశాల హెచ్‌ఎం పరీక్షలు నిర్వహించామని వెంకటేశ్వరస్వామి వచ్చి పరీక్షలు రాస్తారా అంటూ వంగ్యంగా మాట్లాడుతూ విద్యార్థిని కొట్టినట్టు తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడిన నేపథ్యంలో సమాచారం అందుకున్న ఎస్‌ఐలు ఎస్.కాంతారావు, ఎస్.శ్రీనివాస్ పోలీసు సిబ్బందితో అక్కడ చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం జరిగిన సంఘటనపై మండల విద్యాశాఖాధికారులు కె. అప్పల రాములు, టి.టింగరాజు పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. విద్యాశాఖ అధికారులు పాఠశాల హెచ్‌ఎంతో చర్చించి భవిష్యత్‌లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం మరియా జోషిత తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పి భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని బహిరంగ క్షమాపణ పత్రం విద్యార్థుల తల్లిదండ్రులకు ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పోలీస్ సిబ్బంది, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మండల కమిటీ సభ్యులు

టిడిపి మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

టిడిపి మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం స్థానిక కమలా కళ్యాణ మండపంలో ఘనంగా చేశారు. టిడిపి మండల అధ్యక్షునిగా నంబాల వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా బొచ్చు ప్రసాదరావు, ఉపాధ్యక్షులుగా రవ్వల గణపతిరావు, మండల కార్యదర్శిగా ఎల్.వాసు, కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో బిజెపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సలాన శరత్‌కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి బి.దినకర్, మాజీ ఎంపిపి బైరసింగి లక్ష్మీనారాయణ, పరమేశ్వర్‌రెడ్డి, చాపర మాధవరావు, కదంబల పైడిరాజు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

ప్రజాశక్తి- అరసవల్లి

పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా నగరంలోని పాతబస్టాండ్ వద్ద శనివారం వైసిపి నాయుకులు ధర్మాన ప్రసాదరావు, కృష్ణదాస్, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు వెనుక ఒక సుదీర్ఘ చరిత్ర..పోరాటం ఉందన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానంకు ముందు, ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక తెలుగు వారు ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీలో పౌరులుగా ఉండేవారన్నారు. తెలుగు వారి ఉనికికి ప్రత్యేకమైన గుర్తింపు రావడానికి కారణం పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగమేనన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ పిరియా విజయ, ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, బి.శ్రీనువాస పట్నాయిక్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పసుపుల జగన్నాథం అధ్యక్షతన అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సిద్ధికి పొట్టి శ్రీరాములు ప్రాణానికి లెక్క చేయకుండా ఆదర్శమూర్తిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరసవెల్లి వరలక్ష్మి, కూన నారాయణ బాబు, కోట్ల సూర్యనారాయణ, గోగుల ఉషారాణి, శివ్వాల పుణ్యావతి, సంజీవి నళినీ సుధాకర్, పక్కి శ్రీనివాసరావు, సింగం శెట్టి దేవి పాల్గొన్నారు.

కవిటి: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ త్రినాథ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం పొట్టి శ్రీరాములు చేసిన చారిత్రాత్మక త్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు కొనియాడారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ వరప్రసాద్, ఎఒ శ్రీనివాస రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్, జీవన్ కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



అరసవల్లి : శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న నాయకులు



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధికారులు

మేకకు పిఒపి చికిత్స

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని పాతినవారి వీధిలో ఉన్న పశువైద్య కేంద్రంలో మేకకు పిఒపి చికిత్స అందించారు. పశువైద్యాధికారి ఎడి జి.నారాయణరావు ఆధ్వర్యంలో కాలు విరిగిన మేకకు సమగ్ర పరీక్షలు నిర్వహించి ప్రత్యేకంగా పిఒపి (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) చికిత్స చేశారు. మేకకు తీవ్రమైన గాయమైనప్పటికీ సకాలంలో చికిత్స అందించడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఎడి నారాయణరావు సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు కె.స్వర్ణ కీర్తి, నిఖిల, రాజశేఖర్, అప్పలనాయుడు, రాజు పాల్గొన్నారు.



పరిసరాలు శుభ్రం చేస్తున్న రాంబాబు

యువ సూర్య ట్రస్టు మాసోత్సవాలు

ఇచ్ఛాపురం: గత రెండు దశాబ్దాలుగా ఉత్తమ సేవలు అందిస్తున్న యువసూర్య ఛారిటబుల్ ట్రస్టు ఈ ఏడాదీ ఘనంగా మాసోత్సవాలు శనివారం ప్రారంభించారు. మండలంలో ఎం.తోటూరులో సత్య సాయి స్కూల్ నుంచి పూర్ణ థియేటర్ వరకు బాలికల విద్య, పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్, న్యాయవాది రాంబాబు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సేవాభావాలు అలవర్చుకోవాలని సూచించారు. సత్య సాయి స్కూల్ అధినేత భానుతేజ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి అలుపెరగని సేవలందిస్తున్న రాంబాబుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ ఎండి సాహుకరి లక్ష్మి, ఎంపిటిసి కె.గోపి, ప్రేమ్‌దోలాయి, చిన్న భైరి, కె.దేవా, కృష్ణ, ఈశ్వరరావు, శ్రీను, గోవింద పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందిస్తున్న రాజేష్

తుపాను బాధితులకు పరామర్శ

కవిటి: మెంథా తుఫాన్ ప్రభావంతో కవిటి మండలం దూగానుపుట్టుగ పంచాయతీ బైరాగిపుట్టుగలో మూడు ఇళ్ల గోడలు కూలిపోయాయి. ఈ విషయాన్ని పిఎసిఎస్ సభ్యుడు బొగిడియా రాజశేఖర్ ద్వారా తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్ బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేశారు. తుపాను ప్రభావిత కుటుంబాలకు సహాయం అందేలా పార్టీ తరపున చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం దూగానుపుట్టుగలోని గ్రంథాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు స్థానికులు, జనసేన కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లక్కుపురంలో అన్నదానం

బూర్జ: మండలంలోని లక్కుపురంలో శనివారం ఏకాదశి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రంప త్రినాథ, శ్రీనివాస శర్మ తెలిపారు. ఈ సందర్భంగా 4 వేల మందికి అన్నదానం చేసినట్లు వారు తెలిపారు.

మాజీ స్పీకర్ సందర్శన

అతి ప్రాచీనమైన ఈ దేవాలయాన్ని మాజీస్పీకర్ తమ్మినేని సీతారాం దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.